గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న వ్యక్తితో కేర్ ఆస్పత్రి వైద్యులు డా.నగేష్ తదితరులు

కేర్ ఆస్పత్రిలో విజయవంతంగా గుండె మార్పిడి

వెల్లడించిన కేర్ ఆస్పత్రి కార్డియో సర్జన్ డా.నగేష్

బంజారాహిల్స్, జనవరి 30: తీవ్రమైన హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న వ్యక్తికి బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా గుండె మార్పిడి చేసి ప్రాణాలు కాపాడారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేర్ ఆస్పత్రి కార్డియో థొరాసిక్ సర్జన్ డా.నగేష్ వివరాలను వెల్లడించారు. అనంతపురం జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దినేష్ (25) కొంతకాలంగా డైలేటెడ్ కార్డియోమయోపతి (డీసీఎంపీ) అనే గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. ఆటోమెటిక్ కార్డియోవర్టర్ డీఫిబ్రిలేటర్ అమర్చినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో పాటు రోజు రోజుకూ పరిస్థితి విషమంగా మారుతోంది. దీంతో బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో డా.నగేష్‌ను సంప్రదించారు. అన్ని పరీక్షలు చేసిన తర్వాత గుండె మార్పిడి చేస్తేనే ప్రాణాలు కాపాడగలరని తేలింది. దీంతో రెండునెలల క్రితం జీవన్‌దాన్ ఫౌండేషన్‌లో దినేష్ పేరు నమోదు చేయించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండె సేకరించిన కేర్ ఆస్పత్రి వైద్య బృందం విజయవంతంగా గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం, దినేష్ కోలుకుంటున్నాడని డా.నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరెండెంట్ డా.అజిత్ సింగ్, సీవోవో సయ్యద్ కామ్రాన్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ బఫర్‌లో అక్రమ నిర్మాణాలను గుర్తిద్దాం

సుందరీకరణ పనులను వేగవంతం చేద్దాం

క్షేత్రస్థాయి పర్యటనలో అధికారులకు దాన కిశోర్ ఆదేశం

సిటీబ్యూరో, జనవరి 30(నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పనులను వేగవంతం చేసే దిశగా అధికారులు చర్యలు వేగిరం చేస్తున్నారు. పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి దానకిశోర్ మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జలమండలి ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, ఎంఆర్‌డీసీఎల్ ఎస్ఈ వెంకట రమణ, రెవెన్యూ అధికారిణి చంద్రకళలతో కలిసి టిప్పు ఖాన్ బ్రిడ్జి నుంచి బాపూ ఘాట్ వరకు పర్యటించారు. అనంతరం దానకిశోర్ అధికారులతో సమీక్షించారు. బాపూ ఘాట్ నుంచి నాగోల్ వరకు మూసీ బఫర్ జోన్‌లో ఉన్న అక్రమ కట్టడాలను గుర్తించాలని రెవెన్యూ అధికారులకు దానకిశోర్ ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు, చారిత్రక కట్టడాలను గుర్తించాలని చెప్పారు. పాత రెవెన్యూ రికార్డులను సమీక్షించాలన్నారు. మూసీలో బోటింగ్ అసవరమైన స్థలాన్ని గుర్తించాలని, ఇందుకు బ్యారేజి ఎక్కడ అవసరమో చూడాలన్నారు. బాపూఘాట్ నుంచి నాగోల్ వరకు సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశమై మూసీ సుందరీకరణకు సంబంధించిన సమగ్రమైన నివేదికను సిద్ధం చేయాలని దానకిశోర్ సూచించారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమయానికి మూసీ సుందరీకరణపై పీపీటీ (పవర్ పాయింట్ ప్రజంటేషన్) సిద్ధంగా ఉంచాలని అధికారులకు దానకిశోర్ ఆదేశాలు జారీ చేశారు.

సుందరీకరణ పనులలో అధికారులు దాన కిశోర్, అనుదీప్, ఆమ్రపాలి, రొనాల్డ్ రాస్, చంద్రకళ

టీఆర్‌వీకేఎస్ డైరీ ఆవిష్కరణ

తెలంగాణ భవన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) సంఘ క్యాలెండర్, డైరీని మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, ఉద్యోగ సంఘం నాయకుడు దేవీప్రసాద్‌తో కలిసి ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌వీకేఎస్ అధ్యక్షుడు జాన్సన్, ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాశ్, రమేశ్ తదితరులు

- హైదరాబాద్, జనవరి 30(నమస్తే తెలంగాణ)

మెట్రో రెండో దశ కోసం.. సర్వే

కారిడార్-1లో ప్రయాణికులతో వివరాలు సేకరణ

సిటీబ్యూరో, జనవరి 30(నమస్తే తెలంగాణ): రెండో దశ మెట్రో కోసం క్షేత్రస్థాయిలో సర్వే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్, సిస్ట్రా ఇండియా సంయుక్తంగా నగరంలోని వివిధ మార్గాల్లో ఈ సర్వేను చేపట్టాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశ మెట్రోను ఏడు మార్గాల్లో నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మెట్రో రైలు సంస్థ ప్రయాణికులతో నేరుగా సర్వే చేస్తోంది. నిర్మాణం చేపట్టాల్సిన మార్గాలన్నీ ఖరారు కావడంతో వాటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లు రూపొందించేందుకు అవసరమైన ట్రాఫిక్ అధ్యయనం, ఇతర అంశాలను పరిగణనలోకి ఈ సర్వేను మొదలు పెట్టారు. మెట్రో మొదటి దశలో నిర్మించిన కారిడార్-1(మియాపూర్-ఎల్‌బీ నగర్)లో అమీర్‌పేట ఇంటర్‌చేంజ్‌లో సర్వే సిబ్బంది మెట్రో ప్రయాణికులతో పలు అంశాలపై సర్వే నిర్వహిస్తూ వివరాలను నమోదు చేస్తున్నారు. కారిడార్‌కు అనుసంధానంగా మియాపూర్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా పటాన్‌చెరువు వరకు, అదే విధంగా ఎల్‌బీనగర్ నుంచి వనస్థలిపురం మీదుగా హయత్‌నగర్ వరకు రెండో దశలో మెట్రో మార్గాలను పొడిగిస్తూ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో డీపీఆర్‌ను రూపొందించేందుకు ఈ సర్వేను ఈ కారిడార్‌లో చేపట్టారు.

నేడు గద్దర్ జయంతి

ఖైరతాబాద్, జనవరి 30: ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, గద్దర్ తనయుడు గుమ్మడి విఠల్ సూర్యకిరణ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, క్రాంతి దళ్ వ్యవస్థాపకుడు డాక్టర్ సంగం రెడ్డి పృథ్వీరాజ్, సీనియర్ జర్నలిస్టు విఠల్, తెలంగాణ ధూంధాం వ్యవస్థాపక కార్యదర్శి నాగరాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివ రావు, ప్రేమసాగర్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

కీపింగ్ అప్ ద గుడ్ ఫైట్

ప్రముఖ రచయిత ప్రబీర్ పుర్కాయస్థ రచించిన 'కీపింగ్ ఆఫ్ ద గుడ్ ఫైట్' ఫ్రమ్ ఎమర్జెన్సీ టు ప్రజెంట్ డే పుస్తకావిష్కరణ మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఇందుకు ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, ఆర్‌టీఐ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, మాజీ ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. - చిక్కడపల్లి, జనవరి 30

పీజీ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంఏ, ఎం.కామ్ అండ్ (ఐఎస్), ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎల్ఐఎస్సీ, ఎంజే అండ్ ఎంసీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

పీజీ పరీక్షా ఫీజు గడువు పొడిగింపు

అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు తెలిపారు. ఎంఏ, ఎం.కామ్ అండ్ (ఐఎస్), ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఎస్సీ, ఎంజే అండ్ ఎంసీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 3వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 8వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు.

ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ..

ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఇంటిగ్రేటెడ్ కోర్సు పరీక్షా ఫీజును వచ్చే నెల 12వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ కోర్సు మూడు, ఐదు, ఏడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును రూ.300 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు.

దూరవిద్య కోర్సుల ఫలితాలు విడుదల

దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే ఎంఏ (లాంగ్వేజెస్), ఎంఏ (పీపీఎం), ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) కోర్సుల పరీక్షా ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

పద్నాలుగు రైళ్ల పునరుద్ధరణ..

ఆరు రైళ్లు దారి మళ్లింపు

సిటీబ్యూరో, జనవరి 30(నమస్తే తెలంగాణ): ఎస్‌సీఆర్ పరిధిలోని పలు రైల్వే స్టేషన్ల పరిధిలో రద్దైన పద్నాలుగు రైళ్లను పునరుద్ధరిస్తున్నట్టు మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 7 వరకు పునరుద్ధరించిన రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. బెంగుళూరు - న్యూఢిల్లీ, యశ్వంత్‌పూర్ - లక్నో, భువనేశ్వర్ - బెంగుళూరు వంటి స్టేషన్ల మధ్య రైళ్ల రాకపోకలు కొనసాగుతాయన్నారు.

వికారాబాద్‌లో నాలుగు రైళ్లకు తాత్కాలిక స్టాపు..

వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో నాలుగు రైళ్లకు తాత్కాలిక స్టాపు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. వీటిలో ముంబై - భువనేశ్వర్, రాజ్‌కోట్ - సికింద్రాబాద్, భువనేశ్వర్ - ముంబై, సికింద్రాబాద్ - రాజ్‌కోట్ వంటి రైళ్లకు తాత్కాలిక స్టాపు వర్తిస్తున్నదని రైల్వే అధికారులు తెలిపారు.

23 ప్రత్యేక రైళ్ల పొడిగింపు

సిటీబ్యూరో, జనవరి 30(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో పలు రైల్వే స్టేషన్ల మధ్య 23 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి 7 నుంచి, ఏప్రిల్ 28 నుంచి ప్రత్యేక రైళ్లు రాకపోకలు కొనసాగుతాయని పేర్కొన్నారు. సికింద్రాబాద్ - విశాఖపట్నం, తిరుపతి - విశాఖపట్నం, బెంగుళూరు - విశాఖపట్నం, భువనేశ్వర్ - తిరుపతి, హైదరాబాద్ - పాట్నా, సికింద్రాబాద్ - పాట్నా వంటి ప్రధాన రైల్వే స్టేషన్లతో పాటు ఇతర రైల్వే స్టేషన్ల పరిధిలో కూడా ప్రత్యేక రైళ్లను పొడిగించినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అంబర్‌పేట ఇండోర్ స్టేడియం వేదికగా వాలీబాల్ టోర్నీ హోరాహోరీగా సాగుతున్నది. పోటీల రెండో రోజైన మంగళవారం పురుషుల విభాగంలో నెహ్రూనగర్ 25-18, 25-23తో ఆదయ్య నగర్‌పై గెలిచింది. మరోవైపు అంబర్‌పేట ప్లే గ్రౌండ్ 25-19, 23-25, 15-8తో స్పార్ట్స్ స్కూల్‌పై, సాట్స్ 25-11, 25-21తో ఎల్బీ స్టేడియం జట్టుపై విజయాలు నమోదు చేసుకున్నాయి.

వారసత్వ సంపదను కాపాడుకుందాం

- హ్యాపీ హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్

సిటీబ్యూరో, జనవరి 30(నమస్తే తెలంగాణ): హ్యాపీ హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం హెరిటేజ్ రైడ్ జరిగింది. నగర సైక్లిస్టులు సికింద్రాబాద్‌లోని జేమ్స్ స్ట్రీట్, క్లాక్ టవర్ కట్టడాలను సందర్శించారు. ఈ సందర్భంగా సైక్లిస్టు సాంబరి రవి మాట్లాడుతూ, నగరంలోని వారసత్వ కట్టడాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. వారసత్వ కట్టడాలకు మరింత ప్రాశస్త్యం వచ్చేల ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఏండ్లు గడిచినా వాటి నిర్మాణంలో ఎక్కడ చెక్కు చెదరకుండా ఉండటం ఆనాటి కట్టడాల గొప్పతనమని అన్నారు. సైక్లిస్టుల మంతా హెరిటేజ్ కట్టడాల ప్రాధాన్యతపై అందరికి అవగాహన కల్పిస్తామన్నారు. నగరంలోని అన్ని వారసత్వ కట్టడాలను వీకెండ్‌లో సందర్శించి వాటి గొప్పతనాన్ని సోషల్ మీడియా వేదికగా చాటుతామని తెలిపారు.

1న లూయివెల్ వర్శిటీ స్పాట్ అడ్మిషన్లు

అమీర్‌పేట్, జనవరి 30: గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదవాలనుకునే భారత దేశ విద్యార్థులకు యూనివర్శిటీ ఆఫ్ లూయివెల్ ఫిబ్రవరి 1న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనుంది. యూనివర్శిటీ హబ్ ఆధ్వర్యంలో అమీర్‌పేట్‌లోని హోటల్ ఆదిత్య పార్క్‌లో జరిగే ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో యూనివర్శిటీ ఆఫ్ లూయివెల్ ఔత్సాహిక విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు అందించనున్నట్టు అమీర్‌పేట్‌లో మంగళవారం వర్శిటీ ప్రతినిధి డాక్టర్ హాఫ్‌మన్ తెలిపారు.

జాతీయ కుష్టు వ్యాధి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఐఏడీవీఎల్ తెలంగాణ శాఖ అధ్యక్షులు, ఉస్మానియా దవాఖాన డెర్మటాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ఏ.వెంకటక్రిష్ణ

కుష్టు ఓ సాధారణ చర్మ వ్యాధే..

ఉస్మానియా దవాఖాన డెర్మటాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ఏ.వెంకటక్రిష్ణ

సుల్తాన్ బజార్, జనవరి 30: కుష్టు వ్యాధి ఓ సాధారణ చర్మ వ్యాధి మాత్రమేనని, ఈ వ్యాధికి శాశ్వత పరిష్కారం ఉందని ఐఏడీవీఎల్ తెలంగాణ శాఖ అధ్యక్షులు, ఉస్మానియా దవాఖాన డెర్మటాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ఏ వెంకటక్రిష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నెక్లెస్ రోడ్‌లో ఐఏడీవీఎల్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీకి వెంకటక్రిష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి నగరానికి చెందిన ప్రముఖ చర్మవ్యాధి నిపుణులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై ప్రజలు అపోహలను వీడాలన్నారు. స్పర్శ లేని తెల్ల మచ్చలు ఉన్నట్లయితే తక్షణమే చర్మవ్యాధి డాక్టర్‌ను లేదా ప్రభుత్వ దవాఖానకు వెళ్ళాలని సూచించారు. ఈ వ్యాధి సాధారణ చర్మ వ్యాధి మాత్రమేనని ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఐఏడీవీఎల్ తెలంగాణ శాఖ కార్యదర్శి డాక్టర్ జేవీడీ ఎస్ ప్రసాద్, ఐఏడీవీ ఎల్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భూమేన్ కుమార్, తెలంగాణ శాఖ సభ్యులు డాక్టర్ సహన, డాక్టర్ పీఎన్ కుమార్, డాక్టర్ రమేష్, డాక్టర్ ఏజీరావు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఇక ప్రత్యేక పాలన

ప్రత్యేక అధికారులకు జాబితాను సిద్ధం చేస్తున్న అధికారులు

జిల్లాలోని 61 గ్రామ పంచాయితీలకు ప్రత్యేక అధికారులు

మేడ్చల్, జనవరి 30(నమస్తే తెలంగాణ): పంచాయతీలకు ఇక ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. సర్పంచ్‌ల పదవి కాలం ఫిబ్రవరి 2తో ముగియనున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులను నియమించనున్నారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ పర్యవేక్షణలో ప్రత్యేక అధికారుల నియమానికి జాబితాను సిద్ధం చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే, నగరానికి సమీపంలో ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రామాలు అభివృద్ధి చెంది విస్తరించాయి. జిల్లాలో అత్యధికంగా మేజర్ గ్రామ పంచాయతీలు ఉన్న క్రమంలో గజిటెడ్ అధికారులను నియమించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి రమణ మూర్తి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయి. ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా మంచినీరు, వైకుంఠ దామాలు, సెగ్రిగేషన్ షెడ్డుల నిర్మాణాలు, 61 గ్రామ పంచాయతీలలో 81 పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గ్రామ పంచాయలలో 95 శాతానికి పైగా బీఆర్ఎస్ సర్పంచులే ఉన్నారు.

యూనివర్సిటీ సదస్సులో వీసీ కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ గోవర్ధన్, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, ప్రిన్సిపాల్ విజయకుమార్ రెడ్డి, కన్వీనర్ ప్రసన్న తదితరులు

మెకానికల్‌లో నూతన ఆవిష్కరణలు రావాలి

- వీసీ కట్టా నర్సింహారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 30: మెకానికల్ ఇంజనీరింగ్ రంగంలో కొత్త ఆవిష్కరణలు రావాలని జేఎన్టీయూ వైస్ ఛాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో ''అడ్వాన్స్ టెక్నాలజీ ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్'' అన్న అంశంపై ఒకరోజు జాతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ గోవర్ధన్, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, ప్రిన్సిపాల్ కె.విజయకుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జి.వి.నర్సింహారెడ్డి, పూర్వ విద్యార్థి సంఘం సభ్యులు ఇ.రామ్‌జీ, ఇప్పనపల్లి హరిలు హాజరయ్యారు. వర్సిటీ రిజిస్ట్రార్‌గా మంజూర్ హుస్సేన్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని వీసీ అన్నారు. మంజూర్‌కు పదవీ విరమణ సందర్భంగా వీసీ నర్సింహారెడ్డి, రెక్టార్ గోవర్ధన్, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్‌రెడ్డిలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా, వర్సిటీలో పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని, విద్యార్థులకు, అధ్యాపకులకు మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు.

ఐఐపీపీఎల్ విజేత టీమ్ మార్షల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అజీజ్‌నగర్ వేదికగా జరిగిన 5వ ఐఐపీపీఎల్ టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్‌లో టీమ్ మార్షల్ విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో టీమ్ మార్షల్ 14 పరుగుల తేడాతో టీమ్ రాయల్‌పై అద్భుత విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన మార్షల్ నిర్ణీత 20 ఓవర్లలో 129 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన రాయల్ టీమ్ 115/7 స్కోరుకు పరిమితమైంది. క్రిష్ణాంకర్(3/12)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', అబ్దుల్ మునీర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

సమ్మిళిత అభివృద్ధికి రిజర్వేషన్ల అమలు కీలకం

- ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి

అమీర్‌పేట్, జనవరి 30: భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం, సమాజంలోని సభ్యులందరికి, ప్రభుత్వాలు కల్పించే అవకాశాలు సరైన పద్ధతిలో చేరువైనప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బేగంపేట్‌లోని సెస్ మాజీ డైరెక్టర్ దివంగత వాహిదుద్దీన్ ఖాన్ 18వ స్మారక ప్రసంగం మంగళవారం సెస్ ఆడిటోరియంలో జరిగింది. ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి ఈ స్మారక ప్రసంగంలో 'ఉన్నత విద్యలో అవకాశాలు మరియు అసమానతలు' అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలందరికి ప్రాథమిక విద్య తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. సెస్ మాజీ డైరెక్టర్ ప్రొ.వెంకట్రామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ప్రొ.రేవతి పాల్గొన్నారు.

ఐకమత్యంతో గిరిజనులు హక్కులు సాధించుకోవాలి

ఖైరతాబాద్, జనవరి 30: గిరిజనులు ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలని ఆలిండియా బంజార సేవా సమితి జాతీయ అధ్యక్షులు అమర్‌సింగ్ తిలావత్ పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం 71వ ఆవిర్భావ దిన వేడుకలు రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్ నాయక్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ వేడుకలను ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి రవీంద్ర నాయక్., మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలిండియా బంజారా సేవా సమితి జాతీయ అధ్యక్షులు అమర్‌సింగ్ తిలావత్ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో సంఘం ఒకేతాటి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ నాయకులు మోహన్ సింగ్, బీకే నాయక్, టీసీ రాథోడ్, తారాచంద్‌నాయక్, రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ పాల్గొన్నారు.

జలమండలిలో అమరవీరులకు నివాళి

స్వాతంత్ర్య అమరవీరుల దినోత్సవం (షహీద్ దివస్) సందర్భంగా ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో మంగళవారం అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌బాబు, సీజీఎం (పీ అండ్ ఏ) మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఉద్యోగులు, సిబ్బంది.

- సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ)